క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నల్లబెల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్సై గోవర్ధన్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో పాల్పడిన నేరాలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో అబ్బదాసి యాకయ్య, గిరగాని సుభద్రలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, తదితరులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. యాకయ్య సుభద్ర వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం సాయం మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అమీర్, నాయకులు వీరస్వామి, మండల రవి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పోగొట్టుకున్న మొబైల్ అందజేత



నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన తాజుద్దీన్ సెల్‌ఫోన్ పోగొట్టుకోగా దాన్ని స్వాధీనం చేసుకుని అతడికి ఎస్సై గోవర్ధన్ ఆదివారం అప్పగించారు. తాజుద్దీన్ సెల్‌ఫోన్ పోగొట్టుకుని ఈనెల 21న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి మొబైల్‌ను గుర్తించారు. అనంతరం స్వాధీనం చేసుకుని అప్పగించారు.

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదోవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీఓ పి.అపర్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఫిబ్రవరి 2న అన్ని జిల్లాల్లోని ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విదార్థులు ఫిబ్రవరి 1లోగా రూ.100 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 040-23391583, 9491063511, 040-23328266, 040-24734899 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మృతదేహం లభ్యం

నెక్కొండ: గుర్తు తెలియని శవం లభ్యమైన ఘటన స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్ కథనం ప్రకారం.. ఎలుగూరు–నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి సుమారు 32 ఏళ్ల యువకుడు పడగా తలకు బలమైన గాయమై మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, టీషర్ట్ ధరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని డీసీ తండాకు చెందిన మాజీ సర్పంచ్ ఆంగోతు రవీందర్ (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి ఆదివారం వేర్వేరుగా నివాళులర్పించారు. అనంతరం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్‌గా రవీందర్ గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రవీందర్ మృతి తీరని లోటన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని జగన్నాథపల్లికి చెందిన గాడిపెల్లి వెంకటయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు బద్దం వేణుగోపాల్‌రెడ్డి, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- బీటీ తొలగించి 16 నెలలు
- వాహనాల రాకపోకలతో రేగుతున్న దుమ్ము

సంగెం : మండలంలోని గుంటూరుపల్లి నుంచి బొల్లికుంట వరకున్న ఒకటిన్నర కిలోమీటర్ల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని రైతులు, వాహనచోదకులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేసిన బీటీ పూర్తిగా ధ్వంసం కావడంతో గతేడాది ఆగస్టులో ఉన్న బీటీని పూర్తిగా తొలగించారు. నెలరోజుల్లో బీటీ వేస్తామని ఊదరగొట్టినా కంకర పోసి వదిలేశారు. దీంతో రెండు గ్రామాల రైతులతోపాటు రహదారిపై రాకపోకలు సాగించే పాడి గేదేలు, గొర్రెలు, మేకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దుస్థితి నెలకొంది. కంకర కారణంగా గిట్టలు దెబ్బతిని పశువుల బెంబేలెత్తుతున్నాయి. బొల్లికుంట నుంచి వరంగల్, సంగెం దిశగా ప్రయాణం సాగించే ప్రజలు బొల్లికుంట మీదుగా మామునూర్, ఐనవోలు, వర్ధన్నపేట తదితర ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలు, కార్లపై ప్రయాణించే వ్యక్తులు కంకరతో వాహనాలు దెబ్బతింటుండడంతో పట్టపగలే చుక్కలు చూస్తున్నారు. ఇదిలా ఉండగా రోడ్డుపై వాహనాలు ప్రయాణిస్తుంటే దుమ్ము రేగుతుండడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంటలపై దుమ్ము పేరుకుపోయి పత్తి నాణ్యత దెబ్బతింటోంది. వరిపై దుమ్ము కమ్ముకుంటుండడంతో పశువుల మేతకు పనికి రాకుండా పోతోందని రైతులు వేదనకు గురవుతున్నారు. దుమ్ము కారణంగా ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని, రోగాల బారిన పడుతున్నామని సమీప పొలాల రైతులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర వేసి వదిలేసిన రోడ్డు

ఏడాదిన్నరగా ఇబ్బందులు

ఏడాదిన్నరగా కంకర రోడ్డుపై రాకపోకలు సాగించలేక కష్టాలు పడుతున్నాం. వ్యవసాయ భూములకు నిత్యం కంకర రోడ్డు మీదుగా ప్రయాణించాల్సిందే. రోడ్డుపై కంకర తేలడంతో ఎడ్లు, గేదెలు పారిపోతున్నాయి. ద్విచక్ర వాహనాల టైర్లు కంకర కొట్టి పగిలిపోతున్నాయి. రైతులు, ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారస్తులు సహా అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే బీటీ వేసి సమస్యను పరిష్కరించాలి.

\- పసునూరి ప్రభాకర్, రైతు, బొల్లికుంట

త్వరలో బీటీ వేయిస్తాం

బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించాం. ప్రభుత్వం ఎంఆర్‌ఆర్ కింద రూ.40 లక్షలు మంజూరు చేసింది. ఈ క్రమంలో రోడ్డుపై మెటల్ వేయించాం. బీటీ వేసేలోగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు ముగిసినప్పటి నుంచి పనులు చేపట్టే దిశగా కృషి చేస్తున్నాం. కాంట్రాక్టర్‌కు ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నాం. ఈ నెలాఖరులోగా రోడ్డు బీటీ వేయించి సమస్య పరిష్కరిస్తాం.

\- అభిరామ్, పీఆర్, స్పెషల్ ఏఈ

జాతీయ గణిత దినోత్సవం

నర్సంపేట/నర్సంపేట రూరల్/నెక్కొండ : గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నర్సంపేట, నెక్కొండ మండలాల్లోని స్కూళ్లలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నర్సంపేటలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో, లక్నెపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో, నెక్కొండలోని ప్రజ్ఞ కోచింగ్ సెంటర్ శ్రీనివాస రామానుజన్ చిత్రపటాలకు నిర్వాహకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణిత ఒలింపియాడ్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో విజ్‌డమ్ హైస్కూల్ డైరెక్టర్ జావెద్, ప్రిన్సిపాల్ జహంగీర్, బాలాజీ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ప్రజ్ఞ కోచింగ్ సెంటర్ ఎగ్జామినేషన్ ఇన్‌చార్జ్ కర్ణాటి ఉష, అడ్మిషన్ ఇన్‌చార్జ్ కంటె సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డైరెక్టర్ జావెద్, తదితరులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నర్సంపేట రూరల్ : హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. నర్సంపేటలోని ఎస్టీ బాయ్స్ హాస్టల్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. పదో విద్యార్థులకు ఇంటరాక్షన్, మెమరీలో సెషన్ కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే తీరుపై అవగాహన కల్పించారు. ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని సూచించారు. అనంతరం హాస్టల్‌లో వంటలను పరిశీలించారు.

బీజేపీలో పలువురి చేరిక



నర్సంపేట : పట్టణంలో మహిళా మోర్చా జిల్లా నాయకురాలు సూత్రపు సరిత ఆధ్వర్యంలో 18వ వార్డుకు చెందిన మండల రాజేశ్, కొయ్యడి మోహన్ బాబు బీజేపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా రాజేశ్, మోహన్‌బాబులకు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఖానాపురం : అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో పూర్వవిద్యార్థులు

ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి : ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో 2005–07లో ఇంటర్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే చెన్నారావుపేట మండలంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్‌లో 1998–99లో, దుగ్గొండి మండలంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, చెన్నారావుపేటలోని జాగృతి హైస్కూల్‌లో 1994 నుంచి 2004 వరకు చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం వేర్వేరుగా నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమాల్లో సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ గట్ల సురేందర్, సిద్ధార్థ హైస్కూల్ చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, జాగృతి హైస్కూల్ కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి, కాట్రపల్లి గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ బీజేపీ మండల ఎన్నికల అధికారి పూసల శ్రీమాన్ మాట్లాడారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, నాయకులు పెండ్యాల గణేశ్, మంచాల సుమన్, భద్రినాయక్, అజయ్, శ్రీనివాస్, కల్యాణ్, రాకేశ్, కరుణాకర్, నవీన్‌కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు చట్టాలు

ఖానాపురం : వినియోగదారులకు హక్కుల రక్షణకు చట్టాలున్నాయని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రతన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ చెప్పారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వస్తువులు కొనుగోలు చేసిన సమయంలో నకిలీ, కల్తీ, తదితర మోసాలకు గురైనట్టు భావిస్తూ చట్టాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వస్తువులు కొనుగోలు చేసిన సమయంలో తప్పకుండా బిల్లులు తీసుకోవాలని చెప్పారు. వినియోగదారులు మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18004250033కు సమాచారం అందించాలని తెలిపారు. సమావేశంలో వార్డెన్ లావణ్య, సంఘం బాధ్యులు లక్ష్మయ్య, ప్రభాకర్, సారంగం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రతన్‌సింగ్

ధాన్యంపై కప్పిన పరదా చోరీ

రాయపర్తి : మండలంలోని గట్టికల్‌లో రైతు చిన్నాల శ్రీనివాస్ పొలంలో వరిధాన్యంపై కప్పిన రూ.4 వేల 500 విలువైన పరదా చోరీకి గురైంది. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. మండల కేంద్రంలో రైతులు ఆరబోసుకున్న వరి ధాన్యం సైతం చోరీకి గురైన ఘటనలు ఉన్నాయని ఆయన తెలిపారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల సొమ్మును దోచుకునేందుకే విలీనం

- ఎంసీపీఐ(యూ) సహాయ కార్యదర్శి రాజమౌళి

నర్సంపేట రూరల్ : ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకునేందుకే మునిసిపాల్టీల్లో గ్రామాల విలీన ప్రక్రియను చేపట్టిందని ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి విమర్శించారు. పట్టణంలోని మాదన్నపేటలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడారు. గ్రామాలను నిర్వీర్యం చేసి పర్యావరణాన్ని దెబ్బతీయడంతోపాటు వ్యవసాయ రంగాన్ని రోడ్డున పడేసేలా పన్నుల భారాన్ని మోపుతోందంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. విలీన ప్రక్రియను ప్రజల అభిప్రాయం మేరకు కాకుండా కేవలం కొందరు అధికార పక్ష నాయకుల స్వార్థం కోసం చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా విలీనానికి నిర్ణయించడం సరికాదన్నారు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ రెండు నెలల క్రితమే మాదన్నపేట నుంచి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, గ్రామ కమిటీ కార్యదర్శి అనుమాల రమేశ్, మాజీ సర్పంచ్ కర్నే సాంబయ్య, నాయకులు కేశెట్టి శ్రీనివాస్, అల్లం నర్సయ్య, గుర్రం రవి, ఆకుల రాజేందర్; వక్కల రాజమౌళి, కేశెట్టి పెద్ద సాంబయ్య, దానం రాజయ్య, కందికొండ సాంబయ్య, మొలుగూరి ఐలయ్య, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రాజమౌళి, నాయకులు

మహిళకు గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైన ఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణానికి చెందిన బెజ్జం కిష్టమ్మ అంబేడ్కర్ సెంటర్ వద్ద జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు, కాలికి గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

పెన్షనర్స్ డే

వర్ధన్నపేట : తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీజీఆర్‌ఈఏ) ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం పెన్షనర్స్ డే నిర్వహించారు. అసోసియేషన్ స్థానిక యూనిట్ అధ్యక్షుడు తుమ్మల ఎల్లయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు సోమయ్య హాజరై మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. తొలుత ఉద్యోగ విరమణ పొంది మృతి చెందిన వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను శాలువాలతో సత్కరించారు. తదనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సీహెచ్ సోమనాథం ఆర్థిక నివేదిక ప్రవేశపెట్టి తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, కొమ్మాలు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, లక్ష్మి, అఫ్జల్ బీ, సరోజన తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా భూ రిజిస్ట్రేషన్

నల్లబెల్లి : భూమి అక్రమ రిజిస్ట్రేషన్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రుద్రగూడెంకు చెందిన అబ్బు సంజీవరెడ్డికి చెందిన సర్వే నంబర్ 10/బిలోని 23 గుంటల భూమిని గ్రామానికి చెంది వక్కల వెంకటేశ్ కొనుగోలు చేశాడు. సదరు భూమిని స్థానికుడైన ఓ కబ్జాదారు నాగరాజుపల్లి నుంచి సర్వే నంబర్ లేకుండా 40 ఏళ్లుగా హక్కులు ఉన్నట్లు యాజమాన్య ధృవీకరణ పత్రాన్ని సృష్టించి నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్‌ను తప్పుదోవ పట్టించి రిజిస్ట్రేషన్ చేయించాడు. భూయజమాని సహ చట్టం ద్వారా ఇటీవల సేకరించిన సమాచారంతో అక్రమ రిజిస్ట్రేషన్ బట్టబయలైంది. ఈ సందర్భంగా బాధితుడు వక్కల వెంకటేశ్ విలేకరులతో మాట్లాడుతూ తౌటిరెడ్డి రాజిరెడ్డి అతడి భార్య విజయ పేరిట అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపించారు. రెవెన్యూ రికార్డుల్లోనూ అక్రమంగా రాజిరెడ్డి పేరు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి రెవెన్యూ రికార్డుల నుంచి రాజిరెడ్డి పేరు తొలగించి అబ్బు వజ్రమ్మకు పట్టా పాసుపుస్తకాన్ని మంజూరు చేసినట్లు వివరించారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన రాజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా పడిపూజ



నర్సంపేట : అయ్యప్పస్వామి విగ్రహాన్ని తీసుకొస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకులు అయ్యప్పస్వామికి ఆదివారం ఘనంగా దివ్య పడి పూజ, పుష్పాభిషేకం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొనగా అర్చకులు దేవేశ్ మిశ్రా, భద్రకాళి ఆలయ అర్చకుడు రామకృష్ణాచార్యులు అభిషేక పూజలు, పుష్పాభిషేకం, యాగపూజలు చేపట్టారు. అనంతరం దుబ్బ శ్రీదేవి రమేశ్, కల్లూరి నాగజ్యోతి వంశీకృష్ణ, సింగిరికొండ అనసూయ వీరయ్య, మండ సుమలత రాజు, సాయిశంకర్, వైష్ణవి, మల్యాల సోమయ్య, ధనలక్ష్మి, తాటికొండ లావణ్య కిరణ్‌కుమార్, గంధం సుమన్, రోజా, జూలూరి జ్యోతి రాజేంద్రప్రసాద్, కమల సాంబమూర్తి, మణికంఠ, మాధవి, వేణుమాధవ్ సహకారంతో అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. అయ్యప్ప ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు, రైతులు అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు దొంతి అవియుక్త్‌రెడ్డి, పెండెం రామానంద్, వేముల సాంబయ్య, చింతల సాంబరెడ్డి, నరేందర్, చెన్నూరు కిరణ్, భూక్య లక్ష్మణ్‌నాయక్, ఓర్సు తిరుపతి, కాట ప్రభాకర్, బత్తిని రాజేందర్, ములుకల సాంబయ్య, పంబి వంశీకృష్ణ, పేరం రాములు, రూపిక శ్రావణ్‌కుమార్, నరేశ్, నర్సింగరావు, సుమన్, కర్నాటి పార్వతమ్మ, రజని భారతి, రోహిత్, నూనె పద్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : పూజ చేస్తున్న ఎమ్మెల్యే, భక్తులు



రాయపర్తి : పూజ చేస్తున్న సుధీర్‌రెడ్డి, భక్తులు

రామాలయంలో..

రాయపర్తి : మండల కేంద్రంలోని రామాలయంలో అయ్యప్పస్వాములు ఇరుముడి పూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి–ఉషశ్రీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రావులతండా, విద్యానగర్‌తండా, జేతురాం తండా నుంచి అయ్యప్పస్వాములు పాల్గొని అయ్యప్ప శరణుఘోషతో హోరెత్తించారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- ఎంఈఓ సారయ్య

నర్సంపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని ఎంఈఓ సారయ్య తెలిపారు. పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో ఆదివారం స్పోర్ట్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సారయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు క్రీడలు అవసరమని చెప్పారు. క్రీడల కోసం ప్రతీరోజు ఒక పీరియడ్ కేటాయించాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థి దశలోనే క్రీడల్లో ఆసక్తి పెంచుకుని చదువుల్లో, ఆటపాటల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎస్సై రోహిత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో మెళకువలు నేర్చుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులను స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. ప్రముఖ వైద్యుడు, మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు దినచర్యలో భాగంగా రోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, పీఈటీలు ప్రశాంత్‌కుమార్, రియాజ్, రాజేశ్, పృథ్వీ, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ సారయ్య

మహిళల ఆర్థిక సాధికారతే ధ్యేయం

- కౌన్సిలర్ బత్తిని రాజేందర్

నర్సంపేట : మహిళల ఆర్థిక సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ఉచితంగా కుట్టుశిక్షణ ఇప్పిస్తోందని కౌన్సిలర్ బత్తిని రాజేందర్ తెలిపారు. పట్టణంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆయన ఆదివారం కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కుట్టుశిక్షణలో ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకొని మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. రైస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మొగుళ్ల అమరేందర్‌గౌడ్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లోని విద్య, జీవనోపాధి, వ్యవసాయం, వైద్యం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 566 మందికి కుట్టుమిషన్లు ఇప్పించామన్నారు. కార్యక్రమంలో వడ్లకొండ పవిత్రన్, గాదగోని బాబు, సంస్థ ప్రతినిధులు నరేశ్‌కుమార్‌రెడ్డి, శ్వేత, శిక్షకురాలు నాగపురి కవిత, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందజేస్తున్న రాజేందర్, నిర్వాహకులు

అమిత్ షా వ్యాఖ్యలపై ప్రజాసంఘాల నిరసన

పర్వతగిరి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ఆర్‌ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మామిళ్ల చెన్నయ్య, సీపీఎం నెక్కొండ ఏరియా కమిటీ సభ్యుడు జిల్లా రమేశ్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల కుమారస్వామి, నాయకులు చిదురు తిరుపతి, జంగిలి భాస్కర్, జంగిలి బాబు, దబ్బెట నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన షాపురం సాయిలు, భూల అంజయ్య, బొల్ల చిన్న సమ్మయ్యలను ఇటీవల ముదిరాజ్ మహాసభ, తాపీమేస్త్రీ సంఘాల్లో ఎన్నికైన సందర్భంగా రాజకీయ పార్టీలకు అతీతంగా ఆదివారం సన్మానించారు. సాయిలు ముదిరాజ్ మహాసభ మండల ఉపాధ్యక్షుడిగా, అంజయ్య తాపీమేస్త్రీ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా, బొల్ల చిన్న సమ్మయ్య తాపీమేస్త్రీ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తీగల సాయిలు, సుతారి యాదగిరి, చిన్నాల రాజబాబు, మాకినేని పెద్దకృష్ణారావు, బండి రాజేంద్రప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నివాళులు, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944